సాక్షి అనంతపురం

మంగళవారం । 1 । ఏప్రిల్ । 2025



చీనీ టన్ను రూ.26,300

అనంతపురం మార్కెట్‌యార్డులో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.26,300 పలికాయి.



ఐపీఎల్ జోరు.. బెట్టింగ్ హోరు

ఐపీఎల్ సీజన్ నేపథ్యంలో జిల్లాలో బెట్టింగ్ జోరుగా సాగుతోంది. బంతి, బంతికీ బెట్టింగ్ కాస్తున్నారు.బెట్టింగ్‌కు బానిసలై యువకులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. 8లో

గరిష్టం/కనిష్టం
41.1°/21.3°

జిల్లా అంతటా సోమవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గాలివేగం స్వల్పంగా పెరిగింది. ఆగ్నేయం దిశగా గంటకు 8 నుంచి 12 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

4 నుంచి ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ సేవలు



డాక్యుమెంట్ రైటర్లతో మాట్లాడుతున్న జిల్లా రిజిస్ట్రార్ భార్గవ్

అనంతపురం టౌన్: రామ్‌నగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఈ నెల 4 నుంచి ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ సేవలు అందుబాటులోకి వస్తాయని జిల్లా రిజిస్ట్రార్ భార్గవ్ పేర్కొన్నారు. సోమవారం తన కార్యాలయంలో పబ్లిక్ డాక్యుమెంట్ రైటర్లు, రియల్టర్లతో సమావేశం నిర్వహించి అవగాహన కల్పించారు.ఇకపై ప్రజలకు వేచి ఉండే అవసరం ఉండదన్నారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతంగా నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. రోజూ ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ఆన్‌లైన్ సేవలు పొందవచ్చన్నారు. ముందుగానే స్లాట్ బుక్ చేసుకుని నిర్దిష్ట సమయానికి రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేసుకోవచ్చన్నారు. త్వరలో జిల్లాలోని అన్ని సబ్ రిజి స్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ విధానం అమలులోకి వస్తుందన్నారు.

నేటితో ముగియనున్న 'పది' పరీక్షలు

అనంతపురం ఎడ్యుకేషన్: పదో తరగతి పరీక్షలు మంగళవారంతో ముగియనున్నాయి. చివరిరోజు సాంఘిక శాస్త్రం పరీక్ష ఉంటుంది. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్ష జరుగుతుందని డీఈఓ ప్రసాద్‌బాబు, ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ గోవిందునాయక్ తెలిపారు. ప్రభుత్వం ఆప్షనల్ హాలిడే ప్రకటించిన నేపథ్యంలో పరీక్ష మాత్రం యథావిధిగా జరుగుతుందని స్పష్టం చేశారు. విద్యార్థులు, తల్లిదండ్రులు ఈ విషయాన్ని గమనించాలని, ప్రధానోపాధ్యాయులు చొరవ తీసుకుని విద్యార్థులకు సమాచారం చేరవేయాలని ఆదేశించారు.

గుండెపోటుతో సచివాలయ ఉద్యోగి మృతి



మాసినేని శ్రీపతి (ఫైల్)

రాప్తాడు రూరల్: అనంతపురం రూరల్ మండలం కామారుపల్లి సచివాలయంలో వెల్ఫేర్, ఎడ్యుకేషన్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న మాసినేని శ్రీపతి (42) సోమవారం గుండెపోటుతో మృతి చెందారు. రాప్తాడు మండలం పుల్లలరేవు గ్రామానికి చెందిన మాసినేని శ్రీపతి... అనంతపురంలో నివాసం ఉంటూ రోజూ విధులకు వెళ్లొచ్చేవారు. సోమవారం మధ్యాహ్నం ఇంట్లో ఉన్న సమయంలో ఛాతీలో నొప్పి అంటూ భార్యకు తెలపడంతో ఆమె వెంటనే ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్సకు స్పందించక ఆయన మృతి చెందారు. దీంతో మృతదేహాన్ని పుల్లలరేవుకు తరలించి సాయంత్రం అంత్యక్రియలు నిర్వహించారు. కాగా, సమాచారం అందుకున్న కామారుపల్లి సర్పంచ్ లక్ష్మీకళ.. శ్రీపతి మృతిపై సంతాపం వ్యక్తం చేశారు. ఎంపీడీఓ దివాకర్, మాజీ సర్పంచ్‌లు లోకనాథరెడ్డి, ఎర్రినాగులు, పలువురు సచివాలయ ఉద్యోగులు పుల్లలరేవుకు వెళ్లి శ్రీపతి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

బాలుడి అప్పగింత



కుటుంబసభ్యులకు బాలుడిని అప్పగిస్తున్న దృశ్యం

గుత్తి: కుటుంబసభ్యుల నుంచి తప్పిపోయిన ఐదేళ్ల బాలుడి ఆచూకీని పోలీసులు పసిగట్టి సురక్షితంగా తల్లి వద్దకు చేర్చారు. వివరాలు... సజ్జలదిన్నెలో నివాసముంటున్న జిలేఖ కుమారుడు లాల్‌ఖాసీంని గత ఆదివారం ఆమె సోదరుడు కమాల్‌బాషా తన స్వగ్రామం కాసేపల్లికి పిలుచుకెళ్లాడు. సోమవారం మేనల్లుడిని వెంట బెట్టుకుని గుత్తిలోని ఈద్గాలో రంజాన్ ప్రార్థనలకు కమాల్‌బాషా హాజరయ్యాడు. ప్రార్థనలు చేస్తున్న సమయంలో లాల్‌ఖాసీం బయటకు వెళ్లిపోయాడు. అనంతరం చుట్టుపక్కల గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో విషయాన్ని వెంటనే పోలీసులకు చేరవేయడంతో గంట వ్యవధిలోనే గుత్తి శివారులోని అనంతపురం రోడ్డులో ఏడ్చుకుంటూ ఒంటరిగా ఉన్న బాలుడిని గుర్తించి, పోలీసు స్టేషన్‌కు తరలించారు. తల్లి జిలేఖ, మేనమామ కమాల్‌బాషాను స్టేషన్‌కు పిలిపించి అప్పగించారు. ఈ సందర్భంగా పోలీసులకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

పురివిప్పిన పరిటాల ఫ్యాక్షన్!



జిల్లాలో ఫ్యాక్షన్ భూతం మళ్లీ పడగ విప్పింది. రాజకీయ పబ్బం కోసం పచ్చని పల్లెల్లో అగ్గి రాజేస్తూ.. నిత్యం గొడవలు సృష్టిస్తున్న వైనం పాత 'రక్తచరిత్ర' రోజులను గుర్తుకు తెస్తోంది. రెండు దశాబ్దాల క్రితం పరిటాల రవి ఆధ్వర్యంలో ఆర్‌ఓసీ పేరుతో జరిగిన దమనకాండ మళ్లీ ఇప్పుడు జరుగుతోందనే చర్చ జనంలో మొదలైంది. తాజాగా పాపిరెడ్డిపల్లికి చెందిన లింగమయ్య హత్య ఉమ్మడి జిల్లాను ఒక్కసారిగా ఉలికిపాటుకు గురి చేసింది. లింగమయ్యను స్వయానా పరిటాల సునీత బంధువులే చంపినట్టు తేలింది. 2019–2024 మధ్య వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఉమ్మడి జిల్లాలో ఫ్యాక్షన్ ఛాయలనేవే లేకుండా చేస్తే.. నేడు కూటమి ప్రభుత్వంలో 'పచ్చ' నేతలు ఊరూరా గ్రూపులను ప్రోత్సహిస్తూ ప్రత్యర్థులను మట్టుబెట్టే పనిలో నిమగ్నమైనట్లు తెలుస్తోంది.

పోలీసులు నిశ్చేష్టులై..

అరాచకాలు అంతులేని విధంగా జరుగుతున్నా ఇటు అనంతపురం, అటు శ్రీ సత్యసాయి జిల్లాల పోలీసులు నిశ్చేష్టులై చూస్తుండటంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. తాడిపత్రి, రాప్తాడు నియోజకవర్గాల్లో పరిస్థితులు పూర్తిగా అదుపు తప్పినా ఎస్పీలు ప్రేక్షక పాత్ర వహిస్తున్నారు. ఈ క్రమంలో రాజకీయ నేతల అడుగులకు ఖాకీలు మడుగులొత్తుతున్నారన్న విమర్శలున్నాయి. రెండు జిల్లాల్లోనూ ఏమాత్రమూ సాధారణ పరిస్థితులు లేవని, పోలీసులు రాజకీయ నాయకులకు జీ హుజూర్ అంటుండటంతో టీడీపీ మూకలు రెచ్చిపోతున్నాయని సామాన్యులు వాపోతున్నారు.

అడ్డొస్తే హతమే..

- వైఎస్సార్ సీపీ హయాంలో ఐదేళ్లూ ప్రశాంతంగా పల్లెలు
- కూటమి సర్కారులో దమనకాండ
- గ్రామాల్లో పరిటాల అనుచరుల వీరంగం
- ఎదురు తిరిగితే గొడ్డళ్లు, వేటకొడవళ్లతో దాడులు
- పరిటాల రవి హయాంలో జరిగిన హత్యాకాండను గుర్తుకు తెస్తున్న వైనం



ఎమ్మెల్యే పరిటాల సునీత బంధువుల దాడిలో మృతి చెందిన కురుబ లింగమయ్య (ఫైల్)

సాక్షి ప్రతినిధి, అనంతపురం: సార్వత్రిక ఎన్నికల్లో పరిటాల సునీత ఎమ్మెల్యేగా గెలవడం, రాష్ట్రంలో కూటమి సర్కారు కొలువుదీరినప్పటి నుంచి రాప్తాడు నియోజకవర్గంలో అరాచకాలకు అంతు లేకుండా పోయింది. ఎక్కడ ఖాళీ స్థలాలు కనిపించినా, సెటిల్‌మెంట్‌లు ఉన్నా పరిటాల అనుచరులు వాలిపోతున్నట్టు నియోజకవర్గంలో చర్చ జరుగుతోంది. భూముల కబ్జాలు, బెదిరింపులు, వసూళ్లు ఒకెత్తయితే... హత్యలు మరోఎత్తు. తమకు ఎదురుతిరిగితే చాలు కొడవళ్లు, గొడ్డళ్లతో దాడులు చేస్తూ భయకంపితుల్ని చేస్తున్నారు.

అప్పట్లో ఆర్వోసీ పేరుతో..

పరిటాల సునీత భర్త పరిటాల రవి బతికున్న కాలంలో ఆర్‌ఓసీ (రీ ఆర్గనైజేషన్ కమిటీ) పేరుతో జరిగిన హత్యలకు లెక్కలేదు. వందల మందిని చంపేసి ఆచూకీ లేకుండా చేశారన్న ఆరోపణలున్నాయి. రవిని ఎదిరించడం కాదు, ఆ ఆలోచన వచ్చినా అలాంటి వారిని తెల్లారేసరికి లేకుండా చేసేవారని, 'ఆర్వోసీ' దాష్టీకానికి 700 మందికి పైగా బలై ఉంటారని అప్పట్లో రవి అనుచరులుగా ఉన్న వాళ్లే చెబుతున్నారు.

ఈ హత్యల వెనుకా పరిటాల అనుచరులే!

- 2015 ఏప్రిల్ 29న పట్టపగలే రాప్తాడు తహసీల్దార్ కార్యాలయంలో మాజీ ఎంపీపీ భూమిరెడ్డి ప్రసాదరెడ్డిని దారుణంగా నరికి చంపారు. పోలీస్ స్టేషన్ పక్కనే ఉన్న తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన ఈ హత్య అప్పట్లో రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. రాజకీయంగా అడ్డుగా ఉన్నాడని ప్రసాద్ రెడ్డిని పరిటాల అనుచరులు మట్టుబెట్టినట్టు విమర్శలున్నాయి.
- 2018 మార్చి 30న అనంతపురం రూరల్ మండలం కందుకూరులో శివారెడ్డిని దారుణంగా నరికి చంపారు. గ్రామంలో తాగునీటి ఇబ్బందులు లేకుండా ట్యాంకర్లతో నీళ్ల సరఫరా చేసి మంచి పేరు తెచ్చుకున్న శివారెడ్డిని చంపడాన్ని గ్రామస్తులు జీర్ణించుకోలేకపోయారు. ఈ కేసులో ఇటీవలే ఐదుగురు ముద్దాయిలకు జిల్లా కోర్టు 'డబుల్' యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ సంచలన తీర్పు వెలువరించింది. కేసులో రాజీకి రావాలని మృతుడి బంధువులను బెదిరించారంటే ఏస్థాయిలో బరితెగించారో అంచనా వేయొచ్చు.
- గత ఏడాది అక్టోబర్ 10న వైఎస్సార్‌సీపీకి చెందిన గూలి కేశవరెడ్డిని హత్య చేశారు. హత్యలు చేస్తే తమకు ఇక ఎవరూ ఎదురు రారనే ఉద్దేశంతో దారుణానికి ఒడిగట్టారని తెలిసింది. ఇటీవల ఆత్మకూరు మండలం సిద్దరాంపురంలో బాలన్న అనే వ్యక్తిపై పరిటాల సునీత సమీప బంధువులు హత్యాయత్నం చేశారు. తాజాగా పాపిరెడ్డి పల్లికి చెందిన లింగమయ్యపై దాడి చేసి చంపారు. హంతకులు సునీతకు దగ్గరి బంధువులు కావడం గమనార్హం. రామగిరి ఎంపీపీ ఎన్నికల విషయంలో వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా లింగమయ్య ఉన్నాడనే అక్కసుతో హతమార్చారని తేలింది.

సాయినామం.. బృందగానం



సంగీత కచేరీ నిర్వహిస్తున్న విద్యార్థినులు

ప్రశాంతి నిలయం: సత్యసాయి బోధించిన ప్రేమ, సేవ తత్వాలను వివరిస్తూ విద్యార్థులు చేసిన బృందగానంతో భక్తులు మైమరచిపోయారు. సోమవారం ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంత్ సభా మందిరంలో సత్యసాయి మహాసమాధి చెంత అనంతపురం సత్యసాయి క్యాంపస్‌కు చెందిన విద్యార్థినులు సంగీత కచేరీ నిర్వహించారు. చక్కటి గీతాలతో సత్యసాయిని కీర్తిస్తూ సాగిన కచేరీ భక్తుల్ని ఆధ్యాత్మిక సాగరంలోకి తీసుకెళ్లింది. అనంతరం విద్యార్థులు సత్యసాయి మహా సమాధి దర్శించుకున్నారు.

చిచ్చు రేపిన బొమ్మ-బొరుసు

బొమ్మనహాళ్: మండలంలోని కృష్ణాపురంలో ఇద్దరి వ్యక్తుల మధ్య చోటు చేసుకున్న చిన్నపాటి గొడవ ఇరువర్గాల మధ్య ఘర్షణకు దారి తీసింది.దీంతో గ్రామంలో ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు తెలిపిన మేరకు.. సోమవారం సాయంత్రం గ్రామానికి చెందిన ఈశ్వరరెడ్డి, తిప్పయ్యతో పాటు మరికొందరు బొమ్మ–బొరుసు జూదం ఆడసాగారు. ఆ సమయంలో ఈశ్వరరెడ్డికి తిప్పయ్య రూ. వెయ్యి అప్పు పడ్డాడు. ఆట పూర్తికాగానే డబ్బు విషయంగా ఇద్దరి మధ్య మాటామాట పెరిగింది. తిప్పయ్య తరఫున ప్రభాకర్ అనే వ్యక్తి ఈశ్వరరెడ్డితో గొడవ పడ్డాడు. కులాల ప్రస్తావన తెస్తూ కుటుంబసభ్యులను దూషించడంతో ప్రభాకర్‌పై ఈశ్వరరెడ్డి వర్గీయులు దాడికి దిగారు. ఈ క్రమంలోనే తన బంధు వర్గాన్ని ప్రభాకర్ అక్కడకు పిలిపించుకోవడంతో గ్రామంలో ఉద్రిక్తత నెలకొంది. సమాచారం అందుకున్న రాయదుర్గం రూరల్ సీఐ వెంకటరమణ, కణేకల్లు ఎస్‌ఐ నాగమధు అక్కడకు చేరుకుని గొడవ పడుతున్న వారిని అదుపులోకి తీసుకుని పీఎస్‌కు తరలించారు. గ్రామంలో అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా పికెట్ ఏర్పాటు చేశారు.

ప్రశ్నిస్తే చంపేస్తారా?

- పరిటాల సునీత, శ్రీరామ్ డైరెక్షన్‌లోనే లింగమయ్య హత్య
- అధికారంలోకి వస్తే వడ్డీతో సహా చెల్లిస్తాం
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గోరంట్ల మాధవ్
- అంత్యక్రియలకు వెళ్తున్న మాధవ్‌ను అడ్డుకున్న పోలీసులు



మాధవ్ ఇంటి నుంచి బయటకు వెళ్తుండగా అడ్డుకుంటున్న పోలీసులు

అనంతపురం ఎడ్యుకేషన్: కూటమి ప్రభుత్వంలో ప్రశ్నిస్తే చంపేస్తారా అని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గోరంట్ల మాధవ్ మండిపడ్డారు. కురుబ లింగమయ్య అంత్యక్రియల్లో పాల్గొనేందుకు సోమవారం రామగిరి మండలం పాపిరెడ్డిపల్లికి బయలుదేరిన ఆయనను అనంతపురంలోని ఇంటివద్ద పోలీసులు అడ్డుకున్నారు. హౌస్ అరెస్టు చేసి నోటీసు అందజేశారు. ఈ క్రమంలోనే పార్టీ శ్రేణులు అక్కడికి భారీగా చేరుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. ఈ సందర్భంగా విలేకరులతో గోరంట్ల మాధవ్ మాట్లాడుతూ గత ఐదేళ్లూ రాప్తాడు నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి గొడవలు, హత్యా రాజకీయాలను ప్రోత్సహించకుండా పాలన సాగిస్తే పరిటాల సునీత ఎమ్మెల్యే అయిన తర్వాత హత్యా రాజకీయాలకు తెర లేపారని విమర్శించారు. ఒక బీసీ నాయకుడిని అత్యంత దారుణంగా కొట్టి హతమార్చారన్నారు. వీటన్నింటికీ తగిన మూల్యం చెల్లించుకుంటారని హెచ్చరించారు. 'మళ్లీ ఎన్నికల్లో వైఎస్ జగన్ ఓడేదీ లేదు, చంద్రబాబు గెలిచేదే లేదు' అని స్పష్టం చేశారు.

రాష్ట్రాన్ని రావణకాష్టంగా మార్చారు..

ఐదేళ్ల వైఎస్ జగన్ పరిపాలన రామరాజ్యం గుర్తుకు తెచ్చిందని మాధవ్ పేర్కొన్నారు. అలాంటి రామరాజ్యాన్ని చంద్రబాబు సీఎం అయిన తర్వాత రావణకాష్టంగా మార్చారన్నారు. హత్యలు, దాడులు, మానభంగాలు, దోపిడీలు, దౌర్జన్యాలతో ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యం లేదన్నారు. తప్పుడు కేసులు బనాయిస్తూ అక్రమంగా అరెస్ట్‌లు చేస్తున్నారన్నారు. ప్రజాస్వామ్యవాదులపై, ప్రశ్నించేవారిపై, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై దౌర్జన్యాలు, హత్యలు, హత్యాయత్నాలు జరుగుతున్నాయన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కల్గిస్తూ ప్రజాస్వామ్యవాదుల గొంతునొక్కే ప్రయత్నం చేస్తున్న ప్రభుత్వంపై ప్రజలు తిరగబడతారన్నారు.

పరిటాల సునీత, శ్రీరామ్ డైరెక్షన్‌లో హత్యలు

రాప్తాడు నియోజకవర్గంలో పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్ డైరెక్షన్‌లో హత్యలు, హత్యాయత్నాలు జరుగుతున్నాయని మాధవ్ అన్నారు. ఇటీవల ఆత్మకూరు మండలం సిద్దరాంపురంలో బాలన్న అనే వ్యక్తిని పరిటాల సునీత సమీప బంధువులు హత్య చేసేందుకు యత్నించారని, ఆ ఘటన మరువక ముందే పాపిరెడ్డిపల్లిలో కురుబ లింగమయ్యను సునీత దగ్గర బంధువులు హత్య చేశారన్నారు. లింగమయ్య కుమారులను కూడా హత్య చేయాలని చూస్తే వారు తప్పించుకున్నారన్నారు. ప్రభుత్వానికి నూకలు చెల్లే రోజులు దగ్గరలోనే ఉన్నాయని, తాము అధికారంలోకి రాగానే వడ్డీతో సహా తిరిగి చెల్లిస్తామని, చర్యకు ప్రతి చర్య ఉంటుందని స్పష్టం చేశారు.

'ఏడు'పిస్తున్న బాబు



ఎండిన పప్పుశనగ పంట (ఫైల్)

- రబీ కరువు జాబితాలో ఈ సారీ ఏడు మండలాలే
- ఉత్తర్వులు జారీ చేసిన చంద్రబాబు ప్రభుత్వం
- గత ఖరీఫ్, రబీలో పంటల నష్టానికి ఇప్పటికీ 'ఇన్‌పుట్' ఇవ్వని వైనం

అనంతపురం అగ్రికల్చర్: ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి సర్కారు గత పది నెలలుగా ఎలాంటి సాయం చేయకుండా రైతులను ఏడిపిస్తోంది. గత ఖరీఫ్‌లో జిల్లా అంతటా 3.20 లక్షల హెక్టార్లలో పంటలు దారుణంగా దెబ్బతిన్నా... కరువు జాబితాలో కేవలం ఏడు మండలాలను ప్రకటించి రైతును దగాకు గురి చేశారు. తాజాగా ప్రస్తుత రబీకి సంబంధించి ఏడు మండలాలను కరువు జాబితాలో చేరుస్తూ సోమవారం రెవెన్యూ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ డిపార్ట్‌మెంట్ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. వర్షపాతం, పంటల సాగు విస్తీర్ణం, దిగుబడులు, ఉష్ణోగ్రతలు, గాలిలో తేమశాతం, చీడపీడలు తదితర కొలమానాల ఆధారంగా జాబితా ప్రకటించారు. రాష్ట్ర వ్యాప్తంగా అనంతపురం, శ్రీ సత్యసాయి, వైఎస్సార్, కర్నూలు, నంద్యాల, ప్రకాశం జిల్లాల పరిధిలో 51 మండలాలను కరువు ప్రభావిత ప్రాంతాలుగా గుర్తించారు. అందులో 37 మండలాలు తీవ్ర కరువు, మరో 14 మండలాలు సాధారణ కరువు (మోడరేట్) జాబితాలోకి చేర్చి ఉత్తర్వులు ఇచ్చారు.

'శ్రీ సత్యసాయి'లో ఒకటే..

అనంతపురం జిల్లాకు సంబంధించి బెళుగుప్ప, గుంతకల్లు, పెద్దవడుగూరు, తాడిపత్రి, యల్లనూరు, యాడికి మండలాలు తీవ్ర కరువు జాబితాలో ఉండగా విడపనకల్లును సాధారణ కరువు జాబితాలో చేర్చారు. శ్రీ సత్యసాయి జిల్లాలో కేవలం రొద్దం మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించారు. అనంతపురం జిల్లాలో ప్రధానంగా ఉరవకొండ, వజ్రకరూరు, పుట్లూరు తదితర మండలాల్లో పప్పుశనగ అధిక విస్తీర్ణంలో సాగు చేశారు. అలాంటి మండలాలను పక్కన పెట్టడంపై రైతులు మండిపడుతున్నారు. ఓవరాల్‌గా ఈశాన్య రుతుపవనాల ప్రభావంతో అక్టోబర్‌లో 100.9 మి.మీ గానూ 135.1 మి.మీ వర్షం కురిసింది. నవంబర్‌లో 28.6 మి.మీ గానూ 18.1 మి.మీ, డిసెంబర్‌లో 9.8 మి.మీ గానూ 17.3 మి.మీ వర్షం కురిసింది. మొత్తమ్మీద రబీలో 139.3 మి.మీ గానూ 22.5 శాతం అధికంగా 170.6 మి.మీ వర్షం పడింది. వర్షపాతం కాస్తంత అధికంగా నమోదైనా వర్షపు రోజులు (రెయినీ డేస్) కేవలం 13 నమోదు కావడం గమనార్హం. దీంతో పంటల సాగు అతికష్టమ్మీద సాగింది. రబీలో 1,18,330 హెక్టార్లకు గానూ 67 శాతంతో 79,360 హెక్టార్లలో మాత్రమే పంటలు వేశారు. అందులో ప్రధానపంట, వర్షాధారంగా వేసే పప్పుశనగ 50 వేల హెక్టార్లలో సాగైంది. ఆ తర్వాత జొన్న, మొక్కజొన్న, ఉలవ తదితర పంటలు కొంత విస్తీర్ణంలో సాగులోకి వచ్చాయి. పంట దిగుబడుల విషయంలో జిల్లా అంతటా ఒకే రకంగా ఉన్నా... కరువు జాబితాలో మాత్రం కేవలం ఏడింటిని చేర్చడంపై రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వకుండా..

2023 రబీలో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన 17 కరువు మండలాలకు సంబంధించి రూ.37 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ ఇప్పటికీ ఇవ్వలేదు. అలాగే గత రబీ అంటే చంద్రబాబు సర్కారు హయాంలో ఏడు మండలాల రైతులకు రావాల్సిన రూ.20 కోట్లు కూడా అందించలేదు. ఈ రెండు జాబితాలకు సంబంధించి కేంద్ర కరువు బృందాలు జిల్లాకు వచ్చి వెళ్లినా పైసా కూడా విడుదల చేయకపోవడం గమనార్హం. ఇదే కాదు...'అన్నదాత సుఖీభవ' లేదు, పంటల బీమా కింద పరిహారం అందలేదు. రైతు ఆత్మహత్యలకు సంబంధించి బాధిత కుటుంబాలకు పరిహారం ఇవ్వలేదు. ఇలా గత 10 నెలల నుంచి నయాపైసా ఇవ్వకుండా నిలువునా మోసం చేస్తున్నారు. గతంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రకృతి వైపరీత్యాల వల్ల జరిగిన పంట నష్టానికి సీజన్ ముగిసేలోపు ఇన్‌పుట్ సబ్సిడీ అందించి ఆదుకుంది. అలాగే క్రమం తప్పకుండా రైతు భరోసా, ఉచిత పంటల బీమా కింద పరిహారం పెద్ద ఎత్తున అందించి చేయూతనిచ్చింది.

అల్లా హు అక్బర్



జిల్లావ్యాప్తంగా సోమవారం ఈద్–ఉల్–ఫితర్ (రంజాన్) వేడుకలు ఘనంగా జరిగాయి. ఈద్గా మైదానాల్లో ముస్లింలు భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేశారు. మౌలానాలు దివ్య సందేశాన్ని వినిపించారు. దాన గుణం అలవరుచుకోవాలని, పేదలకు సహాయ సహకారాలు అందించాలని సూచించారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. పర్వదినాన్ని పురస్కరించుకుని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం





గుంతకల్లులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



అనంతపురంలోని ఈద్గా మైదానంలో ముస్లింల ప్రార్థనలు

క్లుప్తంగా

హత్యాయత్నం కేసులో నిందితుల అరెస్ట్

అనంతపురం: రాప్తాడు మండలం జి.కొత్తపల్లి మాజీ సర్పంచ్ మోహన్‌రెడ్డిపై దాడి చేసిన ఘటనలో ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు సీఐ సాయినాథ్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. ఆత్మకూరు మండలం వడ్డుపల్లి గ్రామానికి చెందిన చింతపంటి పోతిరెడ్డి కుమారులు దివాకర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డికు, అనంతపురం నగరానికి చెందిన ఫణీంద్రచౌదరికు వడ్డుపల్లి గ్రామంలో ఓ భూమి విషయంగా వివాదం ఉంది. ఇందులో ఫణీంద్రచౌదరికి మద్దతునిస్తూ గాండ్లపర్తి మోహన్‌రెడ్డి అన్ని విధాలుగా ప్రోత్సహిస్తూ వచ్చాడు. దీంతో మోహన్‌రెడ్డిపై కక్ష పెంచుకున్న దివాకర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి పథకం ప్రకారం ఆయనపై దాడి చేసి, గాయపరిచారు. ఈ ఘటనలో పరోక్షంగా సహకరించిన వడ్డుపల్లి గ్రామానికి చెందిన చింతపంటి శివారెడ్డితో పాటు దివాకర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డిను అరెస్ట్ చేసి, దాడికి ఉపయోగించిన రెండు ఇనుప పైపులు, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

మిద్దెపై నుంచి పడి వీఆర్‌ఏ మృతి

లేపాక్షి: స్థానిక పంచాయతీ పరిధిలో వీఆర్‌ఏగా పనిచేస్తున్న రామాంజినప్ప(42) మిద్దెపై నుంచి కింద పడి మృతి చెందాడు. ఆయనకు భార్య, ఒకుమారుడు, కుమార్తె ఉన్నారు. పోలీసులు తెలిపిన మేరకు.. ఆదివారం రాత్రి ఇంటి విషయంలో తన సోదరుడు అశ్వత్థప్పతో రామాంజినప్పకు గొడవ జరిగింది. ఈ సందర్భంగా చోటు చేసుకున్న తోపులాటలో ప్రమాదవశాత్తు రామాంజినప్ప మిద్దెపై నుంచి కిందపడి మృతి చెందాడు. మృతుని భార్య రాధమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ నరేంద్ర తెలిపారు.

ఆకట్టుకున్న కుంకాలాట



ఒంటికొండ దేవాలయం వద్ద కుంకాలు చల్లుకుంటున్న భక్తులు

చెన్నేకొత్తపల్లి: మండల పరిధిలోని ఒంటికొండలో అక్కదేవతల ఉత్సవాల్లో భాగంగా సోమవారం చివరి రోజు కుంకాలాట నిర్వహించారు. భక్తులు ఆలయ ప్రాంగణానికి చేరుకుని ఒకరిపై ఒకరు కుంకాలు చల్లుకున్నారు. ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామస్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. అంతకుముందు అక్కదేవతల విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేపట్టారు.

ఐపీఎల్ జోరు.. బెట్టింగ్ హోరు



సమ్మర్ సీజన్ కాస్త క్రికెట్ సీజన్‌గా మారిపోయింది. బంతి బంతికి ఉత్కంఠ. క్షణాల్లో మారే ఫలితం, ఆద్యంతం ఉద్వేగంతోపాటు కావాల్సినంత వినోదాన్ని క్రికెట్ అభిమానులకు ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) పంచుతోంది. ఈ క్రమంలోనే ఈ సీజన్‌లోనూ నాలుగు రాళ్లు వెనకేసుకునేందుకు బుకీలు తమ కార్యకలాపాల జోరు పెంచారు. గతంలో మాదిరిగానే ఈసారి కూడా జిల్లాలో బెట్టింగ్ రాయుళ్లు చెలరేగిపోతున్నారు. కొన్ని ప్రాంతాల్లో పోలీసుల కళ్లుగప్పి బెట్టింగ్‌లు చాపకింద నీరులా జోరందుకుంటున్నాయి. మరికొన్ని ప్రాంతాల్లో పోలీసులు, ప్రజాప్రతినిధుల అండతో దొంగచాటున ఈ అక్రమ తంతు ఊపందుకుంది.

జిల్లాలో కొనసాగుతున్న క్రికెట్ బెట్టింగ్

- వ్యవహారమంతా ఫోన్, ఆన్‌లైన్‌లోనే
- సరిహద్దు ప్రాంతాలపై బెట్టింగ్ ముఠా కన్ను

రాయదుర్గం/బొమ్మనహాళ్: ఐపీఎల్ జోరుతో నగరం, పట్టణాలు, పల్లెటూళ్లలోనూ క్రికెట్ ఫీవర్ మొదలైంది. మ్యాచుల్లో అందరూ లీనమైపోతున్నారు. చిన్నపిల్లల నుంచి వృద్ధుల వరకు ఐపీఎల్‌కు అభిమానులుగా మారారు. ఏ జట్టు ఎంత స్కోర్ చేసింది. ఎవరు గెలుస్తారు. ఏ క్రికెటర్ సిక్సులు, ఫోర్లతో హోరెత్తిస్తారనే దానిపై ఎక్కడ చూసినా చర్చ సాగుతోంది. కానీ ఇదంతా నాణేనికి ఒకవైపు మాత్రమే. మరోవైపు ఐపీఎల్ పేరిట బెట్టింగ్ జాఢ్యం చాపకింద నీరులా విస్తరిస్తోంది. ముఖ్యంగా యువకులు బెట్టింగ్‌కు బానిసలుగా మారి జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. ఈజీ మనీకి అలవాటు పడి సర్వమూ కోల్పోతున్నారు. క్రికెట్ ప్రేమికుల బలహీనతలను ఆసరాగా చేసుకుని బెట్టింగ్ ముఠాలు విచ్చలవిడిగా పందేలకు పాల్పడుతున్నాయి. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించవచ్చన్న ఆశతో చేతిలో ఉన్న కొద్దిపాటు డబ్బును కూడా పోగొట్టుకుని కొందరు రోడ్డున పడుతున్నారు. కొందరు సర్వం కోల్పోయి ఆత్మహత్యలకు పాల్పడిన ఘటనలూ ఉన్నాయి.

గత ఐపీఎల్‌లో బెట్టింగ్ భూతానికి బలై...

- కర్ణాటక సరిహద్దున ఉన్న రాయదుర్గం పట్టణానికి చెందిన ఓ యువకుడు గత ఐపీఎల్ సీజన్‌లో తన అభిమాన టీం గెలుస్తోందని వరుసగా బెట్టింగ్ కడుతూ అప్పుల పాలయ్యాడు. అప్పు ఇచ్చిన వారి నుంచి ఒత్తిళ్లు తీవ్రం కావడంతో తన తండ్రి నిర్మించి ఇచ్చిన ఇంటిని రూ.43 లక్షలకు విక్రయించి, ఆ డబ్బు మొత్తం వడ్డీ వ్యాపారులకు చెల్లించాల్సి వచ్చింది. ప్రస్తుతం ఆయన అద్దె ఇంట్లో కూలి పనులతో జీవనం సాగిస్తున్నాడు.
- రాయదుర్గంలోని గ్యాస్‌గోడౌన్ ప్రాంతంలో నివాసముంటున్న పాతికేళ్ల యువకుడు గతేడాది ఐపీఎల్ సీజన్‌లో బెట్టింగ్ భూతానికి బలయ్యాడు. రోజు రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు బెట్టింగ్ కాస్తూ చివరకు రూ.50 లక్షలకు పైగా అప్పులు చేశాడు. విషయం ఇంటి వరకు చేరింది. దీంతో అవమానంగా భావించిన సదరు యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.
- రాయదుర్గంలోని ఓ ప్రైవేటు డిగ్రీ కళాశాలకు చెందిన అధ్యాపకుడు సైతం గత ఐపీఎల్ సీజన్‌లో బెట్టింగ్ మాయలో పడ్డాడు. ఈ క్రమంలో అప్పుల పాలయ్యాడు. చివరకు పట్టణ సమీపంలో తనకున్న 60 ఎకరాల భూమిని అమ్ముకోవాల్సి వచ్చింది. ఈ షాక్ నుంచి కోలుకోలేని ఆయన మతిస్థితిమితం కోల్పోయాడని, బెట్టింగ్ జోలికి ఎవరూ వెళ్లొదంటూ పలువురికి ఆయన సహచరులు నేటికీ చెబుతుండడం గమనార్హం.

... ఇలా ఈ నాలుగే కాదు... జిల్లా వ్యాప్తంగా బెట్టింగ్ మహమ్మారికి చాలా మంది బలవుతున్నారు. వెలుగులోకి వచ్చేవి కొన్నైతే తెరచాటున కనుమరుగైపోయ్యేవి లెక్కకు మించే ఉన్నాయి. ప్రస్తుతం ఐపీఎల్ సీజన్ మొదలు కావడంతో జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో బెట్టింగ్ జోరందుకుంది.

అంతా ఫోన్లలోనే

జిల్లాలోని రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ, గుంతకల్లు, తాడిపత్రి నియోజకవర్గాల్లోని పేరుమోసిన అడ్డాల్లో జోరుగా బెట్టింగ్ సాగుతోంది. భారీగా బెట్టింగ్ నడిపేందుకు ఇప్పటికే ఓ గ్యాంగ్ రంగంలో దిగింది. వారికున్న ఇద్దరు పలుకుబడి, ఖాకీ అండతో రూ.కోట్లలో బెట్టింగ్ నిర్వహిస్తున్నారు. తమ వద్ద బెట్టింగ్ కడితే అన్నీ తామే చూసుకుంటామంటూ భరోసానిస్తున్నారు. ఈ వ్యవహారం మొత్తం ఫోన్లలో, ఆన్‌లైన్ ద్వారా సాగుతుండడం గమనార్హం. ఇంకొందరు ఇళ్లు, వ్యాపార కేంద్రాలు, లాడ్జీల్లో కూర్చొని బెట్టింగ్ దందా కొనసాగిస్తున్నారు. మ్యాచ్‌లు ఓడిపోయిన వారు ఒంటిపై బంగారంతో పాటు ద్విచక్రవాహనాలు కుదవబెట్టి రోడ్డు పాలవుతున్నారు. ప్రారంభ దశలోనే ఈ మహమ్మారికి అడ్డుకట్ట వేయకపోతే యువత అప్పుల పాలవడమే కాక, వడ్డీ వ్యాపారుల వేధింపులతో ఆత్మహత్యలు చేసుకునే ప్రమాదమూ ఉంది.

బెట్టింగ్‌ను అణచివేస్తాం

జిల్లాలో క్రికెట్ బెట్టింగ్‌ను పూర్తిగా అణచివేస్తాం. బెట్టింగ్ ఆడినా, ఆడించినా కఠిన చర్యలు చేపడతాం. ఈ వ్యవహారంలో ఎవరు తలదూర్చిన వదిలిపెట్టేది లేదు. జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక నిఘా విభాగాన్ని ఏర్పాటు చేస్తున్నాం. క్రికెట్ బెట్టింగ్‌తో సంబంధాలు ఉండే పాత నేరస్తులందర్నీ బైండోవర్ చేసేలా ఆదేశాలు జారీ చేశాం. బెట్టింగ్ నిర్వహిస్తున్న విషయం తెలిస్తే వెంటనే సమీప పోలీస్‌స్టేషన్లలో సమాచారం ఇవ్వాలి. లేదంటే 100/122కు నేరుగా ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలి. సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతాం.

– పి జగదీష్, ఎస్పీ

ధరల్లేక రైతు దిగాలు

అనంతపురం అగ్రికల్చర్: జిల్లాలో చీనీ, టమాట రైతులు ఆర్థికంగా తీవ్ర నష్టాలు చవిచూస్తున్నారు. ఫ్రూట్ బౌల్ ఆఫ్ ఏపీగా, ఉద్యాన హబ్‌గా పేరుగాంచిన జిల్లాలో చీనీ, టమాట వేల ఎకరాల్లో సాగవుతున్నాయి. వేలాది మంది రైతులు ఈ రెండు పంటలపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. ఈ ఏడాది రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా జిల్లాలో 45 వేల ఎకరాల్లో టమాట వేశారు. ఇక చీనీ తోటలు ఏకంగా 96 వేల ఎకరాల్లో ఉన్నాయి.

ధరలేవీ..? : గత మూడు నెలలుగా కక్కలపల్లి మండీలో టమాట కిలో గరిష్టం, సరాసరి, కనిష్ట ధరలు రూ.8, రూ.7. రూ.6 ప్రకారం పలుకుతున్నాయి. కనిష్టం, సరాసరి ఒక రూపాయి అటుఇటు మారుతున్నా... గరిష్టం మాత్రం రూ.8 దగ్గరే నిలబడిపోయింది. మరో పక్క చీనీ ధరలు కూడా రూ.25, రూ.15, రూ.5 ప్రకారం అమ్ముడవుతున్నాయి. గరిష్టం రూ.25 వేలకు మించి పలకడం లేదు. ఎకరాకు రూ.50 వేల నుంచి రూ.80 వేల వరకు పెట్టుబడులు పెట్టిన రైతులకు ఈ ధరలు గిట్టుబాటు కావడం లేదు. హోళీ అయిపోయింది. రేపు మాపు ఉగాది, రంజాన్ పర్వదినాలు కూడా ముగుస్తాయి. అయినా, ధరలు పతనావస్థలో కొనసాగుతుండటంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఈ ధరలతో ఎలా బతికేది, ఆర్థికంగా ఎలా గట్టెక్కేది అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కూటమి జమానాలో కుదేలు.. : కూటమి జమానాలో జిల్లా రైతులు కుదేలవుతున్నారు. 'పంట ఉత్పత్తులకు మద్దతు ధర కల్పిస్తాం.. లేదంటే కొనుగోలు చేసి ఆదుకుంటామ'ని సీఎం చంద్రబాబు గొప్పగా చెబుతున్నా... ఆచరణకు వచ్చే సరికి రిక్తహస్తం చూపిస్తున్నారు. కక్కలపల్లి మండీలో ఇటీవల కిలో రూ.8 ప్రకారం కేవలం 60 టన్నుల టమాట కొనుగోలు చేసి చేతులెత్తేశారు. ఇక చీనీ రైతుల గురించి పట్టించుకునే నాథులే లేకుండా పోయారు. వారం కాదు.. రెండు వారాలు కాదు.. మూడు నెలలుగా మార్కెటింగ్ స్తంభించిపోవడంతో చీనీ, టమాట రైతులు నష్టాలు మూటగట్టుకుంటున్నారు. మరోపక్క అరటి రైతులు కూడా ధరలు లేక ఆందోళన చెందుతున్న పరిస్థితి. రేపో మాపో మార్కెట్‌కు రానున్న మామిడి రైతులకు కూడా ధరల భయం పట్టుకుంది. ఇటీవల 'అనంత'లో నిర్వహించిన హార్టికల్చర్ కాంక్లేవ్‌లో ఉద్యాన రంగానికి చేయూత ఇస్తామని గొప్పగా మాటలు చెప్పిన మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికార యంత్రాంగం చేతల్లో చూపించడంలో మాత్రం దారుణంగా విఫలమవుతున్నారు.

'కర్ర' పెత్తనంతో విరిగిన విద్యార్థిని భుజపుటెముక

- ఆత్మకూరు జెడ్పీహెచ్‌ఎస్ పరీక్ష కేంద్రంలో ఘటన
- పదో తరగతి పరీక్షలు రాస్తుండగా గిరిజన విద్యార్థినిని కర్రతో కొట్టిన కేంద్రం చీఫ్
- ఎక్స్‌రేలో బహిర్గతమైన దుర్మార్గం



నొప్పి తాళలేక రోదిస్తున్న శ్రావణి



ఎముక విరిగినట్లుగా ఎక్స్‌రేలో కనిపిస్తున్న దృశ్యం

ఆత్మకూరు: పరీక్ష కేంద్రం చీఫ్ సాగించిన 'కర్ర' పెత్తనం ఓ గిరిజన విద్యార్థిని ఉజ్వల భవితకు ఆటంకంగా మారింది. చీఫ్ సూపరింటెండెంట్ విచక్షణ కోల్పోయి కర్రతో కొట్టడంతో విద్యార్థిని భుజపుటెముక విరిగి చివరి పరీక్ష రాయలేక సతమతమవుతోంది. ఆత్మకూరు జెడ్పీహెచ్‌ఎస్ పరీక్ష కేంద్రంలో చోటు చేసుకున్న ఈ ఘటనకు సంబంధించి 'శ్రీనివాసా! ఇదెక్కడి 'కర్ర' పెత్తనం' శీర్షికన సోమవారం 'సాక్షి'లో వెలువడిన కథనం తెలిసిందే. ఆత్మకూరు మండలం వేపచెర్ల ఎగువతండాకు చెందిన రవి నాయక్ కుమార్తె శ్రావణి స్థానిక కేజీబీవీలో పదో తరగతి చదువుతోంది. ఈ క్రమంలో గత కొన్ని రోజులుగా స్థానిక జెడ్పీహెచ్‌ఎస్‌లోని కేంద్రంలో ఆమె పరీక్షలు రాస్తోంది. శనివారం పరీక్ష రాస్తూ జవాబు తోచక దిక్కులు చూస్తున్న శ్రావణిని అక్కడకు చేరుకున్న ఆ కేంద్రం చీఫ్ శ్రీనివాసప్రసాద్ (ఆత్మకూరు జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం) కర్రతో కొట్టాడు. నొప్పి తాళలేక ఆమె విలవిల్లాడుతూ.. 'సార్ కొట్టకండి' అంటూ ప్రాధేయపడిన వినకుండా పదేపదే కర్రతో కొట్టడంతో బాలిక తీవ్రంగా గాయపడింది. పరీక్ష ముగిసిన తర్వాత కేజీబీవీకి చేరుకున్న ఆమె జరిగిన విషయాన్ని తన తండ్రికి తెలపడంతో ఆయన ఆదివారం వచ్చి కుమార్తెకు స్థానిక ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయించాడు. ఆ సమయంలో తాను పరీక్ష రాయనంటూ బాలిక మొండికేయడంతో మంగళవారం చివరి పరీక్ష ఒక్కటి రాయాలని తండ్రి సముదాయించడంతో సరేనని ఒప్పుకుంది. అయితే రాత్రికి నొప్పి తీవ్రత మరింత ఎక్కువ కావడంతో సమాచారం అందుకున్న రవినాయక్ సోమవారం ఉదయం కుమార్తెను అనంతపురంలోని ప్రభుత్వాస్పత్రికి పిలుచుకెళ్లాడు. అనుమానం వచ్చిన వైద్యులు ఎక్స్‌రే తీయించడంతో కుడిచేతి భుజపుటెముక విరిగినట్లుగా స్పష్టంగా కనిపించింది. దీంతో శ్రావణి కుడి చేతికి కట్టు కట్టి పంపించారు. చివరి పరీక్ష రాసేందుకు వీలు కాని పరిస్థితిలో ఉన్న బాలిక దుస్థితిపై ఎంఈఓ నరసింహారెడ్డిని వివరణ కోరగా... 9వ తరగతి విద్యార్థిని సహాయకురాలిగా ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. కాగా, శ్రీనివాస ప్రసాద్ వారం రోజుల క్రితం కూడా కురుగుంటకు చెందిన పదో తరగతి విద్యార్థినిని కొట్టారని, మరో ఇద్దరు విద్యార్థులు అత్యవసరంగా బాత్రూమ్‌కు వెళ్లి వస్తుండగా వారిని పరీక్ష రాయనీయకుండా దాదాపు అరగంటకు పైగా తన గదిలోనే నిలబెట్టినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. శ్రావణి విషయం తెలియగానే ఆత్మకూరు వాసులు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. పరీక్ష కేంద్రంలో విద్యార్థులు తప్పు చేస్తే సీసీ టీవీ ఫుటేజీలను పరిశీలించి చర్యలు తీసుకోవాల్సి ఉండగా, ఇందుకు విరుద్ధంగా చేతి ఎముకలు విరిగేలా కర్రతో కొట్టడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు.

పోలీసుల శవ పంచాయితీ!

సభ్య సమాజం తలదించుకునేలా పోలీసులు వ్యవహరించారు. జనావాస ప్రాంతంలో పడి ఉన్న గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని మార్చురీకి తరలించి, కేసు నమోదు చేయడంలో తీవ్ర నిర్లక్ష్యం కనబరిచారు. అక్కడితో ఆగకుండా మృతదేహం పడిన చోటు తమది కాదంటే తమది కాదని రెండు స్టేషన్ల సిబ్బంది ప్రజల సమక్షంలోనే వాగ్వాదానికి దిగారు. దీంతో మృతదేహం జనావాస ప్రాంతంలోనే గంటల తరబడి ఉండిపోయింది. ఆలస్యంగా వెలుగు చూసిన ఘటనకు సంబంధించి వివరాలు...

ఆదివారం ఉదయం మృతదేహం గుర్తింపు

- రెండు పోలీసు స్టేషన్ల సరిహద్దున గుర్తు తెలియని వ్యక్తి మృతి
- తమ పరిధి కాదంటే తమది కాదని పోలీసుల వాగ్వాదం
- రెవెన్యూ అధికారుల జోక్యంతో సద్దుమణిగిన వివాదం



మామిళ్లకుంట క్రాస్ వద్ద రోడ్డుపై పడిఉన్న శవం

పుట్టపర్తి టౌన్: మండలంలోని మామిళ్లకుంట క్రాస్ వద్ద ప్రధాన రోడ్డుపై ఆదివారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి నడుచుకుంటూ వెళుతూ కుప్పకూలి మృతిచెందాడు. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతదేహం తల కొత్తచెరువు పీఎస్ పరిధిలో, మిగిలిన శరీరం పుట్టపర్తి రూరల్ పీఎస్ పరిధిలో ఉన్నాయి. దీంతో తమ పరిధిలోకి రాదంటూ కొత్తచెరువు పోలీసులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. విషయం తెలుసుకున్న పుట్టపర్తి రూరల్ పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. తల కొత్తచెరువు పీఎస్ పరిధిలో ఉండడంతో ఈ కేసు తమ పరిధిలోకి రాదంటూ వారూ వెళ్లిపోయారు.

సాయంత్రం వరకూ తెగని పంచాయితీ

తమ పరిధి కాదంటే తమది కాదంటూ పోలీసులు వెళ్లిపోవడంతో స్థానికులు తీవ్ర అసహనానికి గురయ్యారు. కాగా, మృతి చెందిన వ్యక్తి కొంత కాలంగా ఆ ప్రాంతంలో సంచరిస్తున్నట్లుగా స్థానికులు గుర్తించారు. రోజూ మద్యం మత్తులోనే ఉండేవాడని తెలిసింది. ఈ క్రమంలోనే ఆదివారం అతిగా మద్యం సేవించిన వ్యక్తి... మధ్యాహ్నం 12 గంటల సమయంలో దాహంతో అలమటిస్తూ జనావాసాల మధ్యనే రోడ్డుపై కుప్పకూలి మృతి చెందినట్లుగా సమాచారం. స్థానికులు ఫోన్ చేయగానే ముందుగా కొత్తచెరువు.. తర్వాత పుట్టపర్తి పోలీసులు వచ్చి తమ పరిధి కాదంటే తమ పరిధి కాదని వెళ్లిపోయారు. దీంతో గ్రామ పెద్దలు జోక్యం చేసుకుని రెండు మండలాల పోలీసులను పిలిపించి మాట్లాడారు. ఆ సమయంలో గ్రామస్తుల మధ్యలోనే పోలీసుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. చివరకు రెండు ప్రాంతాలకు చెందిన వీఆర్వోలు, సర్వేయర్లను పిలిపించి నడిరోడ్డుపైనే పంచాయితీ నిర్వహించారు. రెవెన్యూ మ్యాప్ పరిశీలించి కొత్తచెరువు మండలం లోచర్ల పరిధిలోకి వస్తుందని సర్వేయర్లు తేల్చడంతో కొత్తచెరువు పోలీసులు శవ పంచనామా నిర్వహించి, సాయంత్రం గ్రామ శ్మశాన వాటికలో ఖననం చేయించారు.

కనిపించని కన్నీటి వ్యథ

శెట్టూరు: రాష్ట్రం కాని రాష్ట్రం... బతుకు తెరువు కోసం వలస వచ్చారు. మండుటెండలోనే కంపచెట్ల నీడనే ఆవాసంగా మార్చుకున్నారు. ఇది మహారాష్ట్ర ప్రాంతం నుంచి వలస వచ్చిన 50 కుటుంబాల దీనగాథ. శెట్టూరు మండలం కనుకూరు గ్రామ శివారున చిట్టడవిని తలపిస్తున్న కంపచెట్లలో పాములు, తేళ్లు.. అడవి జంతువులతో సహవాసం సాగిస్తున్నారు. వీరిని పని కోసం పిలుచుకొచ్చిన వారు... వారు ఉండేందుకు ఏర్పాట్లు చేయలేదు. కనీసం తాగునీటి వసతి కూడా కల్పించలేదు. రాత్రయితే చీకట్లోనే ఆ పూట గడిపేస్తున్నారు. ఇది వలస కూలీల దీనగాథ.. పాలకులకు కనిపించని కన్నీటి వ్యథ.



కనుకూరు వద్ద కంపచెట్ల నీడలో ఊయల వేసి పసిపాపను నిద్రపుచ్చుతున్న తల్లి

నేత్రపర్వం.. నెట్టికంటుడి రథోత్సవం

గుంతకల్లు రూరల్: ఉగాది ఉత్సవాల్లో భాగంగా ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో బుధవారం స్వామివారి రథోత్సవం నేత్రపర్వంగా సాగింది. సోమవారం వేకువజామునే నెట్టికంటి ఆంజనేయస్వామి మూలవిరాట్‌కు అర్చకులు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి, విశేష అలంకరణ చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ వేలాది మంది భక్తులు బారులు తీరి స్వామిని దర్శించుకున్నారు. సాయంత్రం ఆలయ ప్రధాన గోపురం ఎదుట రథాన్ని నిలిపి రథాంగహోమం, బలిహరణ పూజలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పుష్పాలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దిన సీతారామలక్ష్మణ సహిత ఆంజనేయస్వామి ఉత్సవ మూర్తులను ఊరేగింపుగా తీసుకువచ్చి రథంపై కొలువుదీర్చారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, ఆలయ ఈఓ కె.వాణి, అనువంశిక ధర్మకర్త సుగుణమ్మ.. నారికేళాలను సమర్పించి రథాన్ని ముందుకు లాగి ఉత్సవాని ప్రారంభించారు. ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం కుటుంబ సమేతంగా సోమవారం సాయంత్రం స్వామిరి వారిని దర్శించుకున్నారు.



రథంపై కొలువుదీరిన సీతారామలక్ష్మణ సహిత ఆంజనేయస్వామి ఉత్సవ మూర్తులు



రథోత్సవంలో పాల్గొన్న వేలాది మంది భక్తులు

3న క్యాన్సర్ ఉచిత స్క్రీనింగ్

పుట్టపర్తి టౌన్: సత్యసాయిబాబా పూర్వ విద్యార్థుల సౌజన్యంతో నిర్వహిస్తున్న శ్రీసత్యసాయి పాలియేటివ్ కేర్ సెంటర్ ఆధ్వర్యంలో ఈ నెల 3న ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంప్ నిర్వహించనున్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 3 గంటల వరకు ఈ శిబిరం ఉంటుంది. 35 సంవత్సరాలు పైబడిన మహిళలు 08047103700కు కాల్ చేసి ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలి. ఎస్‌ఎమ్‌ఎస్ ద్వారా అపాయింట్‌మెంట్ ఇస్తారు. అలాగే ప్రతి నెలా మొదటి గురువారం స్క్రీనింగ్ క్యాంపులు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

క్లుప్తంగా

సల్లాపురమ్మ ఉత్సవాలు ప్రారంభం


అలంకరణలో సల్లాపురమ్మ దేవత

రాప్తాడు: మండలంలోని ఎం.బండమీదపల్లి గ్రామంలో సోమవారం సల్లాపురమ్మ ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉదయం నుంచి రాత్రి వరకూ గ్రామంలో ఉన్న అమ్మవారి గుడిలో ప్రత్యేక పూజలు చేశారు. గ్రామ ప్రజలు ఆలయానికి వెళ్లి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం గ్రామంలో దాదాపు 30 పన్నారపు బండ్లు కట్టుకుని మండలంలోని యర్రగుంట గ్రామంలో వెలసిన చెండ్రాయుడు స్వామి ఆలయానికి చేరుకున్నారు. అక్కడ ఆలయం చుట్టూ పన్నారపు బండ్లు తిప్పి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయం వద్ద చెండ్రాయుని స్వామి పార్వేట నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, శివుడి జాతర (పార్వేట) నిర్వహిస్తారు.

ముస్లింలకు తాగునీటి వసతి


ఈద్గా మైదానానికి వెళ్తున్న ముస్లింలకు తాగునీరు అందిస్తున్న సీపీఎం నాయకులు

అనంతపురం అర్బన్: మతసామరస్యం వర్ధిల్లినప్పుడే ప్రజల మధ్య సోదరభావం పెంపొందుతుందని సీపీఎం నాయకులు అన్నారు. రంజాన్ పండుగ సందర్భంగా సీపీఎం పార్టీ ఇందిరాగాంధీ నగర్ శాఖ ఆధ్వర్యంలో హెచ్ఎల్సీ వద్ద ఉన్న ఈద్గాకు వచ్చే ముస్లింలకు సోమవారం తాగునీటి వసతి కల్పించారు. ఈ సందర్భంగా నగర కార్యదర్శి రామిరెడ్డి మాట్లాడుతూ.. ప్రజలందరూ మతసామరస్యంతో మెలిగినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. పాలకులు తమ రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజల మధ్య మత, కుల చిచ్చు పెడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వీటిని ప్రజలు ఐక్యంగా తిప్పికొట్టాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ప్రకాష్, వెంకటనారాయణ, బోయ ఆంజనేయులు, రాము, మోహన్, రాఘవ, నాగేశ్వరరావు, రమణ, వన్నూరప్ప, తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కుంకాలాట


ఒంటికొండ దేవాలయం వద్ద కుంకాలు చల్లుకుంటున్న భక్తులు

చెన్నేకొత్తపల్లి: మండల పరిధిలోని ఒంటికొండలో అక్కదేవతల ఉత్సవాల్లో భాగంగా సోమవారం చివరి రోజు కుంకాలాట నిర్వహించారు. భక్తులు ఆలయ ప్రాంగణానికి చేరుకుని ఒకరిపై ఒకరు కుంకాలు చల్లుకున్నారు. ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామస్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. అంతకుముందు అక్కదేవతల విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేపట్టారు.

వక్ఫ్ బిల్లును ప్రవేశపెట్టొద్దు


ఎన్ఎస్ గేట్ ఈద్గాలో నిరసన వ్యక్తం చేస్తున్న ముస్లింలు

చెన్నేకొత్తపల్లి: వక్ఫ్ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టొద్దని ముస్లింలు డిమాండ్ చేశారు. రంజాన్ పండుగ సందర్భంగా సోమవారం ఈద్గాకు చేరుకున్న ముస్లింలు నల్లబ్యాడ్జీలతో శాంతియుతంగా నిరసన వ్యక్తం చేశారు. ఈ బిల్లుతో ముస్లింలకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు.

టీఎండీ వలి సేవలు భేష్


రిటైర్డ్ ఎస్ఐ వలి దంపతులను సన్మానిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

రాప్తాడురూరల్: తన 35 ఏళ్ల ఉద్యోగ జీవితంలో వివిధ హోదాల్లో పని చేసినా ఏ చిన్న రిమార్కు లేకుండా ప్రజాసేవలో ఎస్ఐ టీఎండీ వలి (బుల్లెట్ వలి) బుల్లెట్‌లా దూసుకెళ్లారని అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశ్వర్లు, రూరల్ సీఐ శేఖర్ కొనియాడారు. అనంతపురం రూరల్ పీఎస్‌లో ఎస్ఐగా పని చేస్తున్న టీఎండీ వలి సోమవారం ఉద్యోగ విరమణ పొందారు. రాత్రి పోలీస్‌స్టేషన్ ఆవరణలో సన్మాన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ, సీఐ మాట్లాడుతూ.. ముస్లిం మైనార్టీలకు అత్యంత పవిత్రమైన రంజాన్ పండుగ రోజు రిటైర్డ్ కావడం వలి అదృష్టమన్నారు. 35 ఏళ్ల సర్వీసులో క్రమశిక్షణతో పని చేశారన్నారు. అనేక కేసులను ఛేదించారన్నారు. ఎన్నో అవార్డులు, రివార్డులు అందుకున్నారన్నారు. అల్లా దయతో ఆయన శేష జీవితం కుటుంబ సభ్యులతో సంతోషంగా సాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎస్ఐ రఫీక్, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

రంజాన్ శోభ


చిన్నారుల ఆత్మీయ ఆలింగనం


ఈద్గా మైదానంలో నమాజ్ చేస్తున్న ముస్లింలు


ర్యాలీగా వెళ్తున్న ముస్లింలు


రంజాన్ శుభాకాంక్షలు చెబుతున్న మౌలానా


రంజాన్ శుభాకాంక్షలు చెబుతున్న మేయర్ వసీం, చిత్రంలో కాగజ్‌ఘర్ రిజ్వాన్ తదితరులు


ఆత్మకూరులో రంజాన్ విశిష్టతను వివరిస్తున్న హజరత్ సయ్యద్ షబ్బీర్


సర్దార్ వలి దర్గాలో దువా చేస్తున్న దృశ్యం



వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా నిరసనలు


రాప్తాడులో సామూహిక ప్రార్థనలు


వజు చేస్తున్న ముస్లింలు


మంచినీరు అందజేస్తున్న దాతలు

అనంతపురం కల్చరల్: రంజాన్ వేడుకలు సోమవారం జిల్లా వ్యాప్తంగా వైభవంగా జరిగాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకూ నగరంలోని వివిధ ప్రాంతాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ రంజాన్ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. మసీదులు, దర్గాల్లో ఆధ్యాత్మిక శోభ నెలకొంది. స్థానిక డ్రైవర్స్ కాలనీ, హెచ్చెల్సీ కాలనీలోని ఈద్గా మైదానాలు సామూహిక ప్రార్థనల కోసం వేలాదిగా తరలివచ్చిన ముస్లింలతో కిటకిటలాడాయి. ప్రత్యేక ప్రార్థనల అనంతరం మత పెద్దలు సందేశం వినిపించారు. శాంతి ప్రబోధాన్ని అందించే పవిత్ర ఖురాన్ ఆవిర్భావ రంజాన్ మాసంలోనే జరిగిందన్నారు. ధర్మసంస్థాపన కోసం భగవంతుడు దైవదూత అయిన మహ్మద్‌ను భువిపై అవతరించేలా చేశారని.. ఆయన ప్రవచించిన సిద్ధాంతాలే మార్గదర్శకాలు అన్నారు. అనంతరం పక్కనే ఉన్న ఖబరస్తాన్‌లోని సమాధుల వద్ద పెద్దల ఆత్మశాంతి కోసం ప్రార్థనలు చేశారు. మత సామరస్యాన్ని చాటుతూ ఇచ్చిన విందుల్లో పలువురు హిందువులు ఉత్సాహంగా పాల్గొన్నారు. సాయిట్రస్టు ఆధ్వర్యంలో పలు చోట్ల అన్నదానం జరిగింది. నిరుపేద ముస్లింలకు నిత్యావసర వస్తువులు అందజేశారు. మేయర్ వసీం సలీం, జిల్లా వక్ఫ్ బోర్డు మాజీ చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, మాజీ ఊర్దూ అకాడమీ చైర్మన్ నదీం అహ్మద్, కార్పొరేటర్ రహంతుల్లా, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ గౌసుమొద్దీన్ తదితరులు ముస్లింలకు ఈద్ శుభాకాంక్షలు తెలిపారు.

వక్ఫ్ సవరణ బిల్లు ప్రమాదకరం

సామూహిక ప్రార్థనల అనంతరం ఈద్గా మైదానం సమీపంలో జమాతే ఇస్లామీ హింద్ సంస్థ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో వక్ఫ్ చట్టాల సరవణలకు వ్యతిరేకంగా నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న వక్ఫ్ సవరణ బిల్లును వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. బ్యానర్లు, ప్లకార్డులు పట్టుకుని నిరసన తెలియజేస్తున్న వారికి మేయర్ వసీం సలీం, జిల్లా వక్ఫ్ బోర్డు మాజీ చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, కార్పొరేటర్ రహంతుల్లా తదితరులు సంఘీభావం తెలిపారు.

ఆత్మకూరు: మండల వ్యాప్తంగా సోమవారం రంజాన్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. మండల కేంద్రంలోని నూరియా జామియా మసీదు నుంచి ముస్లింలు అల్లాహు అక్బర్.. అల్లాహు అక్బర్ అంటూ ఈద్గా మైదానానికి తరలివెళ్లారు. హజరత్ సయ్యద్ షబ్బీర్ మాట్లాడుతూ.. రంజాన్ ప్రత్యేకత, దానధర్మాలు చేస్తే వచ్చే పుణ్యం, మహమ్మద్ ప్రవక్త గురించి వివరించారు. అనంతరం నమాజ్ చేశారు. ముస్లింలు ఒకరినొకరు అలింగనం చేసుకుంటూ ఈద్ ముబారక్ చెప్పుకున్నారు. అనంతరం స్థానిక సయ్యద్ సర్దార్‌వలి దర్గాలో చక్కెర చదివింపులు చేసి సలామ్ (ప్రత్యేక గీతం) పాడారు. ముట్టాల, సనప, తోపుదుర్తి, మదిగుబ్బ, బి.యాలేరు గ్రామాల్లో రంజాన్ పండుగను సంతోషంగా జరుపుకున్నారు.

రాప్తాడు: మానవుడు తన స్వార్థ ప్రయోజనాలకు మాత్రమే ప్రాధాన్యత ఇవ్వకుండా అందరికీ తమ వంతు సాయం అందించేలా ఉండాలని మౌలానా ఉమర్ పేర్కొన్నారు. సోమవారం రంజాన్ పండుగ సందర్భంగా రాప్తాడులోని 44వ జాతీయ రహదారిపై ఉన్న ఈద్గా మైదానంలో సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా మత పెద్ద మౌలానా ఉమర్ మాట్లాడుతూ.. ప్రతి ముస్లిం తన జీవితంలో ఖురాన్ బోధించిన పంచ సూత్రాలను పాటించాలన్నారు. పేద, ధనిక భేదం లేకుండా కలసి మెలసి పండగ జరుపుకోవాలన్నారు. పండగ చేసుకునే స్థోమత లేని నిరుపేదలకు చేయూత ఇవ్వాలని సూచించారు. దాన ధర్మాలకు ఆత్మీయ పండుగ ఈద్-ఉల్-ఫితర్ (రంజాన్) అని వివరించారు. పేదవాడి ఆకలిని గుర్తు చేస్తూ మనిషిలోని దుర్మార్గాన్ని, దురలవాట్లను పోగొట్టేదే రంజాన్ దీక్ష అని తెలిపారు.

ఘనంగా నవరాత్రి వసంతోత్సవాలు


అలంకరణలో అనంతేశ్వరి


పారాయణం చేస్తున్న మహిళలు

అనంతపురం కల్చరల్: అనంతేశ్వరి వసంత నవ రాత్రి మహోత్సవాలు ఘనంగా సాగుతున్నాయి. సోమవారం స్థానిక శివబాలయోగి ఆశ్రమంలో మహిళా మండలి ఆధ్వర్యంలో సామూహిక శ్రీమణిదీప వర్ణన, పారాయణం తొమ్మిది పర్యాయాలు చేశారు. అమ్మవారి నామస్మరణతో మార్మోగించారు. అలాగే శ్రీదేవి ఖడ్గమాల స్తోత్రం పారాయణం అనంతరం ఆశ్రమంలో కొలువుదీరిన వివిధ దేవతలకు అభిషేకాలు, అర్చనలు, అలంకార సేవలతో ఆరాధించారు. ఆశ్రమ ప్రతినిధులు మాట్లాడుతూ.. ఏప్రిల్ 6 వరకూ సాగే వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో అందరూ పాల్గొనాలని కోరారు.

'మోటూరు' స్ఫూర్తితో పోరాటాలు


మోటూరు ఉదయం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఐద్వా నాయకురాళ్లు

అనంతపురం అర్బన్: మహిళా హక్కుల కార్యకర్త మోటూరు ఉదయం స్ఫూర్తితో పోరాటాలు సాగిస్తామని ఐద్వా నాయకురాళ్లు స్పష్టం చేశారు. సోమవారం స్థానిక సీపీఎం కాలనీలో మోటూరు ఉదయం వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకురాలు చంద్రిక మాట్లాడుతూ.. మోటురు ఉదయం 18 ఏళ్లు ఆంధ్రప్రదేశ మహిళ సంఘం కార్యదర్శిగా, ఆ తరువాత గౌరవాధ్యక్షురాలిగా ఉన్నారన్నారు. ఫాసిస్ట్ వ్యతిరేక ప్రచార కార్యకలాపాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు మహిళ బుర్రకథ సాంస్కృతిక నాయకత్వాన్ని వహించారన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో సైకిల్ తొక్కిన మొదటి మహిళగా గుర్తింపు పొందారని తెలిపారు. 1964లో భారత కమ్యూనిస్టు పార్టీలో చీలిక వచ్చినప్పుడు ఆమె భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు వైపు మళ్లిందన్నారు. అత్యవసర పరిస్థితి సమయంలో అణచివేత నుంచి తప్పించుకునేందుకు అజ్ఞాతంలోకి వెళ్లారని పేర్కొన్నారు. మహిళ హక్కుల కోసం ఎన్నో పోరాటాలు చేసిన ఆమె బాటలో ప్రతి కార్యకర్త నడవాలన్నారు. కార్యక్రమంలో నాయకురాళ్లు అశ్విని, వెంకటలక్ష్మి, గీత, తదితరులు పాల్గొన్నారు.

అనంత యువకుడికి అభినందన


బిసాతి భరత్‌కు జ్ఞాపిక అందజేస్తున్న మాజీ రాష్ట్రపతి రామనాథ్ కోవింద్

అనంతపురం కల్చరల్: జమిలీ ఎన్నికలపై అన్ని రాజకీయ పార్టీలకు చెందిన పార్లమెంటు సభ్యులు, వివిధ రాజకీయ పార్టీల అధినేతలను కలిసి జమిలీకి మద్దతుగా సంతకాల సేకరణ చేసినందుకు అనంతకు చెందిన బిసాతి భరత్‌ను మాజీ రాష్ట్రపతి రామనాథ కోవింద్ అభినందించారు. భరత్‌ను తన నివాసానికి పిలిపించుకుని సేవా కార్యక్రమాలను అడిగి తెలుసుకున్నారు. నెహ్రూ యువకేంద్రం యువ అధికారిగా, ప్రగతి పథం అసోసియేషన్ వ్యవస్థాపకుడిగా ఎంతో మంది యువతకు వ్యక్తిత్వ వికాసం నేర్పిన ట్రైనర్‌గా విశిష్ట సేవలతో గతంలో రాష్ట్రపతి అవార్డు అందుకోవడం స్ఫూర్తిదాయకమని రామనాథ్ కోవింద్ కొనియాడారు. సేవలను ఇలాగే కొనసాగించాలని సూచించారు. అనంతరం జమిలీ ఎన్నికలకు మద్దతుగా సేకరించిన జాబితాను మాజీ రాష్ట్రపతికి భరత్ అందజేశారు. కార్యక్రమంలో జాతీయ యువ అవార్డు గ్రహీత శివకుమార్, విశాలాక్షి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు నిలయ్ అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎస్‌గేట్ కూడలిలో భారీ బందోబస్తు


పోలీసు బందోబస్తు నడుమ లింగమయ్య మృతదేహాన్ని అంబులెన్స్‌లో తరలిస్తున్న దృశ్యం

చెన్నేకొత్తపల్లి: టీడీపీ నాయకుల దాడిలో గాయపడిన రామగిరి మండలం పాపిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన కురుబ లింగమయ్య అనంతపురం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన విషయం తెలిసిందే. సోమవారం కురుబ లింగమయ్య మృతదేహాన్ని అంబులెన్స్‌లో ఆయన స్వగ్రామం పాపిరెడ్డిపల్లికి తరలించేందుకు చర్యలు తీసుకున్నారు. కాగా.. మండల పరిధిలోని ఎన్ఎస్ గేట్ మీదుగా పాపిరెడ్డిపల్లికి మృతదేహాన్ని తరలించాల్సి రావడంతో పోలీసులు పకడ్బందీగా బందోబస్తు చేపట్టారు. రామగిరికి వెళ్లే రహదారిలో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి పంపారు. పోలీసు వాహనాల నడుమ కురుబ లింగమయ్య మృతదేహాన్ని ఆయన స్వగ్రామానికి తరలించారు.

ఎస్పీ రత్న పర్యవేక్షణ

శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చర్యలు తీసుకోవాలని ఎస్పీ వి.రత్న పోలీసులను ఆదేశించారు. ఎన్ఎస్ గేట్ వద్ద బందోబస్తును పర్యవేక్షించారు. ఈ ప్రాంతంలో పరిస్థితి ఎలా ఉందని డీఎస్పీ, సీఐలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రామగిరి మండలం పాపిరెడ్డిపల్లికి వెళ్లారు.

కూటమి ప్రభుత్వంలో రక్షణ కరువు


సాకే హరిని అడ్డుకుంటున్న పోలీసులు

అనంతపురం: కూటమి ప్రభుత్వంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు రక్షణ కరువైందని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి మండిపడ్డారు. రామగిరి మండలం పాపిరెడ్డిపల్లి గ్రామంలో కురుబ లింగమయ్య దారుణ హత్యను తీవ్రంగా ఖండిస్తూ ప్రభుత్వ సర్వజనాసుపత్రి ఎదుట జేఏసీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. మృతదేహాన్ని చూడకుండా పోలీసులు అడ్డుకోవడంతో ఆందోళనకు దిగారు. కూటమి నాయకులను మాత్రమే ఆసుపత్రిలోకి పంపారని.. కుల, ప్రజా సంఘాల నాయకులను గేటు ముందే అడ్డుకోవడం ఏమిటని ప్రశ్నించారు. కురుబ లింగమయ్య హత్యకు కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తామని బహిరంగా మాట్లాడుతున్నారంటే రాష్ట్రంలో పరిస్థితులు ఎంత దారుణంగా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చన్నారు. అడ్వకేట్ గొని నాగన్న, బహుజన వేదిక చంద్రచర్ల హరి, జేఏసీ నాయకులు రామకృష్ణ, వెంకటేశ్, వంశీ, మారుతి పాల్గొన్నారు.

ముగిసిన 'వడ్డీ మాఫీ' గడువు


పన్ను చెల్లించేందుకు వచ్చిన నగరవాసులు

- నెల రోజుల్లో రూ.15.39 కోట్ల పన్ను వసూలు
- వడ్డీ మాఫీతో అసెస్‌మెంట్‌దారులకు రూ.76 లక్షల లబ్ధి

అనంతపురం కార్పొరేషన్: నగరంలో ఈ ఏడాది మార్చిలో ఇంటి, నీటి, ఖాళీజాగా పన్ను వసూళ్లు పరుగులు పెట్టాయి. గతేడాదితో పోల్చితే ఈ ఏడాది ఏకంగా రూ.6.72 కోట్లు అదనంగా వసూలైంది. మార్చి నెలలో మాత్రమే రూ.15.39 కోట్ల వరకు పన్ను వసూలు కావడంలో కమిషనర్ బాలస్వామి కీలక పాత్ర పోషించారు. అందులోనూ వడ్డీ మాఫీ ద్వారా రూ.76 లక్షల వరకూ అసెస్‌మెంట్‌దారులకు లబ్ధి చేకూరింది.

ఆరు రోజుల్లో రూ.10.27 కోట్లు వసూలు

నగరంలోని 50 డివిజన్లకు సంబంధించి 74 సచివాలయాల పరిధిలో 58,561 అసెస్‌మెంట్లు ఉన్నాయి. కాగా 2024–25 ఆర్థిక సంవత్సరంలో మొత్తం డిమాండ్ రూ.60.69 కోట్లు ఉంది. కాగా ఈ ఏడాది మొత్తం ఇంటి పన్ను రూ.38.05 కోట్లు వసూలైంది. ఈనెల 25న ప్రభుత్వం ఒకేసారి పన్ను చెల్లిస్తే వడ్డీలో 50 శాతం మాఫీ చేస్తున్నట్లు ప్రకటించింది. దీంతో అసెస్‌మెంట్‌దారులు పన్ను చెల్లించేందుకు సుముఖత వ్యక్తం చేశారు. ఈనెల 26న రూ.1.04 కోట్లు, 27న రూ.1.09 కోట్లు, 28న రూ.1.28 కోట్లు, 29న రూ.1.78 కోట్లు, 30న రూ.82 లక్షలు, సోమవారం (మార్చి 31న) రూ.2.42 కోట్లు వసూలయ్యాయి. కేవలం ఆరు రోజుల్లో రూ.10.27 కోట్లకు పైగా వసూళ్లు జరిగాయి. అదే విధంగా వడ్డీ మాఫీతో అసెస్‌మెంట్‌దారులకు భారీగా లబ్ధి చేకూరింది. 2023–24లో ఇంటి, నీటి, ఖాళీ జాగా పన్ను రూ.33.75 కోట్లు వసూలైతే.. ఈ ఏడాది రూ.40.47 కోట్లు వసూలైంది. గతేడాదితో పోల్చితే రూ.6.72 కోట్లకు పైగా వసూలైంది.

కమిషనర్ చొరవతో కదలిక

పన్ను వసూళ్లలో నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామి ప్రత్యేక చొరవ తీసుకున్నారు. పన్ను చెల్లించని మొండి బకాయిదారులపై చట్టపరమైన చర్యలకు ఆదేశించారు. నగరంలోని కొన్ని ప్రాంతాల్లో ట్యాప్ కనెక్షన్లు తొలగించడంతో పాటు రెడ్ నోటీసులు జారీ చేశారు. నిర్లక్ష్యంగా ఉన్న సచివాలయ సిబ్బందికి మెమోలు జారీ చేశారు. అదేవిధంగా కమిషనర్ ఆదేశాలతో డీసీ వెంకటేశ్వర్లు, ఆర్ఓలు లక్ష్మీదేవి, విజయ్‌కుమార్, ఆర్ఐలు రఘునాథ్ రెడ్డి, రజాక్, చంద్ర, పెద్దక్క, 74 సచివాలయాల సిబ్బంది, తదితరులు బృందాలుగా ఏర్పడి పన్ను వసూళ్లకు శ్రమించారు. నగరపాలక సంస్థతో పాటు నగరంలోని 5 ప్రాంతాల్లో పన్ను చెల్లింపు కేంద్రాలను ఏర్పాటు చేశారు. నీటి పన్ను ఇంకా రూ.14 కోట్లు పెండింగ్‌లో ఉంది. దీనిపై కూడా దృష్టిసారిస్తే బాగుంటుందని నగరపాలక సంస్థ వర్గాలంటున్నాయి.

సమష్టి కృషితో వసూళ్లు



పన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాం. నగరాభివృద్ధికి ఆదాయాన్ని పెంచుకోవడమే పరమావధి. ఇంటి, నీటి, ఖాళీ జాగా పన్నులను వేగవంతం చేయాలని సిబ్బందిని ఆదేశించాం. రెవెన్యూ, సచివాలయ సిబ్బంది బాగా పని చేశారు. ఇదే స్ఫూర్తితో ఆర్థిక సంవత్సరంతో సంబంధం లేకుండా రెగ్యులర్‌గా పన్ను వసూళ్లపై దృష్టిసారించి నగరాభివృద్ధికి పటిష్ట చర్యలు తీసుకుంటాం.

– బాలస్వామి, నగరపాలక సంస్థ కమిషనర్

6న కల్లూరులో గ్రామీణ క్రీడా పోటీలు

గార్లదిన్నె: మండలంలోని కల్లూరులో శ్రీరామనవమి సందర్భంగా గ్రామస్తుల ఆధ్వర్యంలో అగ్రహారం ఆంజనేయస్వామి దేవాలయం వద్ద యువకులకు గ్రామీణ క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. సోమవారం వారు మాట్లాడుతూ ఇసుక మూట, గుండు పైకి ఎత్తే పోటీలు, కర్రసాము పోటీలు, ఇరుసు ఎత్తే పోటీలు, బరువు పైకి ఎత్తే పోటీలు నిర్వహిస్తామన్నారు. గెలుపొందిన వారికి నగదు బహుమతులు అందజేస్తామన్నారు. ఆసక్తి ఉన్న వారు 9701141448, 9618083257 నంబర్లను సంప్రదించాలన్నారు. క్రీడాకారులకు భోజన సదుపాయం ఏర్పాటు చేశామన్నారు.